సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 18 । జూన్ । 2023



చోరీకి యత్నించి.. వ్యక్తిని చంపేసి..

చోరీకి యత్నించి, ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన సుండుపల్లె మండలంలో చోటుచేసుకుంది. - 8లో



నేర ప్రవృత్తి కట్టడితోనే శాంతిభద్రతలు

జిల్లాలో నేరాల సంఖ్య, నేర ప్రవృత్తి కట్టడితోనే శాంతిభద్రతలు సాధ్యమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.320
రెండోరకం	రూ.200	రూ.268

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1186 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	401	536
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 313.96 కిలోలు

న్యూస్‌రీల్

డాక్టర్ అంబేడ్కర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

వైవీయూ: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాలలో 2023-24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కడప రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. చెన్నకేశవ రెడ్డి తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీలతో పాటు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు జూలై 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఆర్ఏఓయూ.ఆన్‌లైన్.ఇన్‌తో పాటు అధ్యయన కేంద్రంలోని 7382929603 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు డీఈఓ కార్యాలయానికి హాజరుకావాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో జెడ్పీ హైస్కూళ్లలో పనిచేస్తున్న హెచ్‌ఎంలకు, మండల విద్యాశాఖాధికారులకు ఎంఈఓ-2 పోస్టులు భర్తీ చేసేందుకు మార్గదర్శకాలను విద్యాశాఖ కమిషనర్ విడుదల చేశారని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు (2005 నుంచి 2012 సంవత్సరాల మధ్య పదోన్నతి పొందిన వారు) 18వ తేదీన ఉదయం 9 గంటలకు డీఈఓ కార్యాలయానికి హాజరుకావాలన్నారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తమ సర్వీసు వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో నమోదు చేసుకుని తమ సర్వీసు పుస్తకంతోపాటు తమకు సంబంధించిన పదోన్నతి సీనియారిటీ జాబితాలతో హాజరుకావాలని కోరారు.

వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో నేరుగా ప్రవేశాలు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించాల్సి ఉన్న ఏడీసెట్-2023 (ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్)ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఏడీసెట్-23 చైర్మన్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, కన్వీనర్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి శనివారం తెలిపారు. దరఖాస్తు చేసిన ప్రతి అభ్యర్థికి సమాచారాన్ని తెలియజేస్తామని పేర్కొన్నారు.

నాన్నకు ప్రేమతో..!

- పిల్లల పెంపకంలో కీలకపాత్ర పోషిస్తున్న తండ్రి
- పుట్టినప్పటి నుంచి స్థిరపడేవరకు అంతా తానై
- చదువుతోపాటు తీర్చిదిద్దడంలోనూ ప్రత్యేక శ్రద్ధ
- నేడు ఫాదర్స్‌డే

సాక్షి రాయచోటి : జీవితంతో విడదీయలేని బంధం నాన్న. ఆయన లేని మన పుట్టుకను, జీవితాన్ని ఊహించుకోలేం. తల్లితో కలిసి ఆయన బిడ్డల అభివృద్ధికి పడే తపనను ఎవరూ వర్ణించలేరు. బిడ్డలు దినదినాభివృద్ధి చెందుతుంటే గుండెలనిండా సంతోషంతో పొంగిపోయే వ్యక్తి 'నాన్న'. దేవుని తర్వాత అంతటి స్థానం అమ్మతోపాటు నాన్నకూ ఉంది. అమ్మను మమతానురాగాలకు ప్రతిరూపంగా భావించే మనం...నాన్నను మాత్రం భయపెట్టే వ్యక్తిగా భావిస్తూ ఉంటాం. నిజానికి కుటుంబ పెద్దగా తన బాధ్యతల పట్ల తండ్రి బాధ్యత ఏమిటీ? స్పందన ఎలా ఉంటుందన్న విషయం చర్చించేందుకే ప్రతి సంవత్సరం జూన్ 3వ ఆదివారం తండ్రుల దినోత్సవంగా నిర్వహిస్తున్నాం.

పెద్ద దిక్కు

అమ్మ మనకు ఉనికినిస్తే...నాన్న విలువ కల్పిస్తాడు. అమ్మ నవమాసాలు మోసి సంతానాన్ని, ఇంటిని చక్కదిద్దేందుకు కృషి చేస్తే నాన్న పెద్దదిక్కుగా ఆ



తల్లీబిడ్డలతోపాటు మొత్తం కుటుంబానికి రక్షణగా నిలుస్తాడు. అమ్మకు కష్టం వస్తే నాన్నకు చెప్పుకుంటుంది. కన్నీరు పెట్టుకుని గుండె బరువు దించుకుంటుంది. కానీ తండ్రికి ఆ అవకాశం కూడా ఉండదు. ఇంటా, బయటా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తండ్రి ఆ బాధను గుండెల్లోనే దాచుకుంటాడు. ఎంతో మానసిక ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతాడు. అందుకే పక్షవాతం, హెమరేజ్, గుండెపోటు లాంటి వ్యాధులు ఎక్కువగా పురుషులకే వస్తాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కుటుంబం కోసం నాన్న కొవ్వొత్తిలా కరిగిపోతుంటాడు. చివరి వరకు వెలుగునిచ్చేందుకే ప్రయత్నిస్తాడు.

పిల్లల పెంపకంలో ప్రధానపాత్ర

కుటుంబంలో బిడ్డలను పెంచడం మొదలుకొని ఉన్నత శిఖరాలకు చేర్చేవరకు తండ్రి నిద్రపోడు. వారికి నడవడిక, బడిబాట, ఉద్యోగం, పదవులు ఇలా ఏదైనా సరే కుటుంబం వెనుక తండ్రి ప్రధాన భూమిక పోషిస్తాడన్నది జగమెరిగిన సత్యం. కాల క్రమేణా సమాజంలో టెక్నాలజీ పెరిగిన తరుణంలో కొంతమేర పిల్లలు తల్లిదండ్రులపై ద్వేషం చూపిస్తున్నా.. కుటుంబ పెద్దగా తండ్రిమాత్రం పండు ముసలితనంలోనూ కుటుంబీకులపై కోపం చూపకుండా ప్రేమను పంచుతున్నాడు. కొందరు ప్రబుద్ధులు పండుటాకైన తండ్రిని వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నా కూడా పిల్లలపై ప్రేమ, ఆప్యాయతలు చూపుతున్నారే తప్ప ద్వేషం చూపించని, కల్మషం లేని మనస్తత్వం నాన్నది.

నాన్నే స్ఫూర్తి

చిన్నప్పటి నుంచి నేను నాన్న శివరామెగౌడను చూసే నేర్చుకున్నా. ఎవరితోనైనా మాట్లాడటం, కుటుంబ పెద్దగా వ్యవహరిస్తున్న తీరు అన్నీ ఆకట్టుకున్నాయి. నాన్నతో కలిసి వెళ్లడం మొదలుకొని ప్రతి అంశంలోనూ ఆయనే నాకు స్ఫూర్తిగా నిలిచేవారు. చదువుకుంటే ఏదైనా ఎవరికైనా చేయవచ్చన్న ఆయన చెప్పిన మాటలు నాకు ఆదర్శం. అందుకే ఏదైనా సాధించాలన్న నాన్న మాటలతోనే నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నా. సమాజం గురించి ఆలోచించేలా ఆయన చెప్పిన మాటలు, ఆయన నడవడిక నాలో స్ఫూర్తిని రగిలించింది. ప్రతి కుటుంబంలో తండ్రి పాత్ర కీలకమైనది.

– గిరీషా పీఎస్, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా



తండ్రితో కలెక్టర్ పీఎస్ గిరీషా (ఫైల్)

తండ్రిపాత్ర అమోఘం



కుటుంబంలో కుమారుడు తన కంటే పెద్ద స్థాయిలో ఉండాలని కోరుకునే వ్యక్తి...తపన పడే వ్యక్తి తండ్రి. మా తండ్రి కేశవరావు సాధారణంగానే కుటుంబంలో తండ్రి పడే కష్టాలు పిల్లలకు రాకూడదన్న లక్ష్యంతోనే తీర్చిద్దారు. పిల్లలకు కష్టాలు తెలియకూడదన్న ఆలోచనతో ముందుకు వెళుతూ వారు కష్టాలు పడుతూ పిల్లలను ఉన్నత స్థాయిలో నిలబెట్టడం తండ్రి గొప్ప తనాన్ని తెలియజేస్తుంది. తల్లి జన్మనిస్తే...తండ్రి అంతా తానై పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతాడు. సమాజంలో తండ్రి పాత్ర అమోఘం.

– గంగాధర్‌రావు, జిల్లా ఎస్పీ, రాయచోటి, అన్నమయ్య జిల్లా

తిరువణ్ణామలైకి ప్రత్యేక సర్వీసులు



కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ఆర్టీసీ రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి జులై 2వ తేది అరుణాచల గిరి ప్రదక్షిణ కోసం తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజారవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి సూపర్ లగ్జరీ (ఛార్జి రూ. 1042) ఇంద్ర (రూ. 1384) సర్వీసు, పులివెందుల నుంచి సూపర్‌లగ్జరీ (రూ. 1242), మైదుకూరు (రూ. 1604), ప్రొద్దుటూరు (రూ. 1604) డిపోల నుంచి ఇంద్ర ఏసీ, జమ్మలమడుగు డిపో నుంచి సూపర్ లగ్జరీ (రూ.1352) సర్వీసులను నడుపుతున్నామన్నారు. తిరువణ్ణామలైకి వెళ్లే భక్తులు రిజర్వేషన్ చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

షిర్డీకి ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్: జులై 1న పౌర్ణమి సందర్భంగా ప్రొద్దుటూరు డిపో నుంచి షిర్డీకి ఇంద్ర ఏసీ బస్సును నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పి.గోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ బస్సు మధ్యాహ్నం 1.00 గంటకు ప్రొద్దుటూరులో బయలుదేరి జోగులాంబ అమ్మవారి ఆలయం, తుల్జాపూర్ భవానీమాత ఆలయం, శని సింగనాపూర్ ఆలయ దర్శనం ఉంటుందన్నారు. రాను, పోను రూ. 4600 ఛార్జిగా నిర్ణయించారన్నారు. మైదుకూరు, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు నుంచి కూడా ఈ బస్సుకు రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.

ప్రణాళికాబద్ధంగా జగనన్న సురక్ష కార్యక్రమం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జిల్లాలో ప్రణాళికాబద్ధంగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ నుంచి ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి నారాయణ భరత్ గుప్తాతో కలిసి ముఖ్యమంత్రి కార్యదర్శి ముత్యాలరాజు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు హాజరయ్యారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి యాప్‌ను ప్రారంభించిన అనంతరం వారం రోజులపాటు వలంటీర్, గృహ సారథులు ఇంటింటికి వెళ్లి అమలవుతున్న పథకాలకు సంబంధించి పౌరులతో చర్చించాలన్నారు. సమస్యలను నమోదు చేసుకొని సంబంధిత డిజిటల్ అసిస్టెంట్లకు ఇవ్వాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీఓల ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. జూలై 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు రెండు బృందాలు వారికి కేటాయించిన ప్రతి సచివాలయాన్ని సందర్శించి ప్రజల నుంచి అందిన విజ్ఞప్తులను పరిశీలించాలన్నారు. ఇందులో ముఖ్యంగా సర్టిఫికెట్ జారీ, అమలవుతున్న పథకాలు, ద్వైవార్షిక మంజూరు అంశాలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో గ్రామ వార్డు సచివాలయ జిల్లా కో-ఆర్డినేటర్ మనోహర్ రాజు, డీపీఓ ధనలక్ష్మీ, జెడ్పీ కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, డీఎస్ఓ రఘురాం, సీపీఓ కృష్ణానాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


20 నుంచి 'మెడికల్ అండ్ హెల్త్' ఉద్యోగుల బదిలీలు

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో ఈ నెల 19 నుంచి ప్రారంభం కావాల్సిన బదిలీలను 20, 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ తెలిపారు.

పలక.. బలపం.. అదో జ్ఞాపకం!

- పలకా... పలకా నాటి పలుకులు ఏవీ...?
- ఆధునిక బోధనలో పలక అడ్రస్ గల్లంతు
- అక్షరాలు దిద్దించే ప్రక్రియలో మార్పులు
- పాఠశాలల్లో సీసీఈ విధానం అమలు

మదనపల్లె సిటీ: ఎందరినో గొప్ప వ్యక్తులుగా మలచిన పలక చిరునామా ఆధునిక బోధనలో గల్లంతైంది. ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులను చూడగానే తక్కున మనకు కన్పించేది పలక, బలపంతో కూడిన చిన్నటి సంచి. తరగతి గదిలో వారు ప్రవేశించగానే మొదట ఉపాధ్యాయులు అక్షరమాలను నల్లబల్లపై రాయడం, తర్వాత ప్రతి విద్యార్థి దగ్గరకెళ్లి వారికి అక్షరాలను పలకలో రాసిచ్చి వాటిని చదువుతూ దిద్దమని చెప్పడం మనందరం చూసిందే. కాలానుగుణంగా బోధన, అభ్యసన ప్రక్రియలో మార్పు చోటు చేసుకుంటూ వస్తోంది. ఫలితంగా నేటి విద్యార్థులు పలకలకు దూరమవుతూ వస్తున్నారు. వాటి స్థానాల్లో నోటు పుస్తకాలు, డిజిటల్ బోర్డులు ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో పలకలు తెరమరుగవుతున్నాయి. తక్కువ ఖరీదు ఉండే మట్టి పలక చాన్నాళ్లు హవా కొనసాగించింది. ప్రాథమిక విద్యలో కీలక భూమిక పోషించింది. బిడ్డకు మూడో సంవత్సరం వచ్చిందంటే అక్షరాభ్యాసం



చేయించేవారు. విద్యాభ్యాస కెరీర్‌కు వేసే తొలి అడుగులో 'పలక' ప్రధాన పాత్రదారి. పలకపై ఓంకారం బలపంతో రాయించేవారు. తరువాత బడిలో 'అ' నుంచి అక్షర క్రమం నేర్చుకునే ప్రక్రియ అంతా పలకమీదే సాగేది. అమ్మ అనే పదంతో ప్రారంభమై ఐదో తరగతి వరకూ సాగే చదువుకు పలకే ఆధారం. 90వ దశకం వరకూ మట్టి పలక నడిచిందని నాటి ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తర్వాత ఆ స్థానంలో రేకు పలకలు వచ్చాయి. అవి కొన్నాళ్లు పాటు కొనసాగాయి. తర్వాత డిజిటల్ పలకలు (రాసి చెరిపేసుకునేవి) వచ్చాయి. అవి ఇంటికి మాత్రమే పరిమితమయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో 1 నుంచి 5 వ తరగతి వరకు 16,829 మందికిపైగా విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో పలక లేకుండా అడుగుపెట్టారు. వారంతా ఆధునిక బోధనలో అక్షరాలు నేర్చుకుంటున్నారు.

సీసీఈ విధానంతో...

ప్రస్తుతం అన్ని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో సీసీఈ (సమగ్ర మూల్యాంకనం) విధానం అవలంబిస్తున్నారు. ఉపాధ్యాయుడు చెప్పిన అంశాలను విద్యార్థి గ్రహించి ధారాళంగా చదవడం నేర్చుకుంటాడని పలక మీద అక్షరాలు దిద్దే ప్రక్రియను సీసీఈ విధానంలో తొలగించారు. విద్యాహక్కు చట్టం -2009 ప్రకారం నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలులోకి వచ్చింది. దీంతో బట్టీపట్టే విధానం పూర్తిగా పోయింది. ప్రైవేటు స్కూళ్లల్లో ప్రీప్రైమరీ, ప్రభుత్వ పాఠశాలల్లో పలకా, బలపం అవసరం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తామే లిటిల్ లెర్నర్స్, ఫోనో రైటింగ్ బుక్స్ ఇస్తామంటున్నారు. వీటి ద్వారా అక్షరాలు దిద్దే ప్రక్రియ ఉండదు. నాలుగు లైన్ల గడులతో ఉన్న పుస్తకాల్లో పైన ముద్రించిన అక్షరాలు చూస్తూ రాయాల్సి ఉంటుంది. అక్షరాలు బట్టీ బట్టి రాయనవసరం లేదని, గుర్తించుకుంటూ చదివితే సరిపోతుందని ఈ తరం చెబుతోంది. సీసీఈ విధానంతో గుర్తింపు అంటే బొమ్మలు, ప్రాక్టికల్స్ ద్వారా బోధిస్తున్నారు.

పలక ఒక అనుభూతి



పలకపై అక్షరాలు దిద్దడం ఒక అనుభూతి. చిన్నప్పుడు మా నాన్న మట్టి పలక కొనిచ్చి బడికి పంపేవారు. దానిపైనే ఏడాది పాటు చదువుకున్నాను. ప్రస్తుతం పాఠశాలల్లో అక్షరాలతో ఉన్న బుక్స్ ఇస్తున్నారు.

–టీఎస్‌పి కృష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె

స్కూల్ తెరవగానే అమ్మకాలు



వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తెరిచేనాటికి పెద్ద సంఖ్యలో పలకలు స్టాకు తెప్పించి దుకాణంలో పెట్టుకునేవాళ్లం. మట్టి పలకలు ఎక్కువగా అమ్మేవాళ్లం. ప్రస్తుతం రేకు పలకలు వచ్చాయి. వాటిని రూ.50–70 వరకు అమ్ముతున్నాం. ఎక్కువగా అమ్ముడుపోవడం లేదు.

–ప్రసాద్‌రెడ్డి, దివ్యభారతి బుక్‌స్టాల్, మదనపల్లె

సీసీఈ విధానమూ మంచిదే



గ్రహించడం ద్వారా నేర్చుకోవడం ప్రస్తుత బోధనా విధానం. ప్రతి స్కూల్ యాజమాన్యం సీసీఈ విధానమే అవలంబిస్తోంది. పలకపై బట్టీపడుతూ అక్షరాలు దిద్దే ప్రక్రియకు పూర్తిగా స్వస్తి పలికారు. సీసీఈ విధానం మంచిదే.

–పురం రమణ, ఉపాధ్యాయుడు, వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

క్లుప్తంగా

డ్రిప్ పైపులు స్వాధీనం

కలకడ : చోరీకి గురైన డ్రిప్ పైపులు (ర్యాడర్స్)ను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సిటి స్వామి తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని కలకడ–గుర్రంకొండ రోడ్డు సమీపంలోని కలకడ కొత్తపల్లె సమీపంలో కలకడకు చెందిన మిద్దె సయ్యద్ పాజిల్ భూమిలోని డ్రిప్ పైపులు, వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ మేరకు బాధితుడు శనివారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. గుర్రంకొండ మండలం ఎల్లుట్ల గ్రామం నల్లగుట్టపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు రామచంద్ర, సంబేపల్లె మండలం అగ్రహారం గ్రామానికి చెందిన రంగిన్‌సాహెబ్ కుమారుడు సయ్యద్‌బాషా కలకడలో విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13500 విలువ చేసే పైపులు, వైర్లు స్వాధీనం చేసుకుని, సీజ్ చేసి, కోర్టుకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

– ఒకరి మృతి, మరొకరికి గాయాలు



మహబూబ్‌బాషా (ఫైల్)

సంబేపల్లె/కలకడ : సంబేపల్లె మండలంలో చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై శనివారం ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు చెందిన మహబూబ్‌బాషా(62) ఆవుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే శనివారం సంబేపల్లె మండలంలోని పెద్దబిడికి వెళ్లి ఆటోలో తిరిగి సొంత గ్రామానికి వస్తుండగా.. మార్గం మధ్యలో గుట్టపల్లె సమీపంలోని డంపింగ్‌యార్డు(చెత్త కేంద్రం) వద్దకు రాగానే తిరుపతి నుంచి పులివెందులకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మహబూబ్‌బాషా మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సంబేపల్లె పోలీసులు తెలిపారు.

చోరీకి యత్నించి.. వ్యక్తిని చంపేసి..

- మహిళ మెడలో గొలుసు దోచుకెళ్లడానికి యత్నం
- అడ్డుకోవడంతో ఆమె భర్తను హత్య చేసి పరారీ



మృతి చెందిన రామాంజులరెడ్డి

సుండుపల్లె (రాయచోటిటౌన్) : చోరీకి యత్నించి, ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన సుండుపల్లె మండలం పింఛా సమీపంలోని కొండలతూర్పులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండలతూర్పులోని పవన్ కుమార్ అదే గ్రామానికి చెందిన రామాంజులరెడ్డి భార్య మనోహరి మెడలోని బంగారు గొలుసును శుక్రవారం రాత్రి దోచుకెళ్లడానికి పథకం వేసుకున్నాడు. బాగా నిద్రపోయే సమయంలో వారి వద్దకు వెళ్లాడు. ఆమె మెడలో బంగారు గొలుసు దోచుకెళ్లడానికి ప్రయత్నం చేశాడు. కానీ ఆమె మెడలో బంగారు గొలుసు లేకపోవడంతోపాటు మెలకువ రావడంతో వెంటనే లేచి అరిచింది. దీంతో భర్త కూడా మెలకువలోకి రావడంతో ఇద్దరి మధ్య పెనుగులాట మొదలయ్యింది. ఈ పెనుగులాటతో దొరికి పోతాననే భయంతో తనతోపాటు తెచ్చుకొన్న మిరపపొడి రామాంజులరెడ్డి కళ్లలో చల్లి కత్తితో గొంతు, మెడపైన తీవ్రంగా గాయపరిచాడు. అయినా రామాంజులరెడ్డి భార్య తన భర్తను కాపాడుకునేందుకు తీవ్రంగా ప్రతిఘటించింది. పెనుగులాటలో ఆమెకు కూడా గాయాలయ్యాయి. ఈ గొడవలో గట్టిగా అరవడంతో నిందితుడు పారిపోయాడు. స్థానికులు వచ్చి తీవ్రంగా గాయపడిన రామాంజులరెడ్డిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. కానీ ఆయన అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సుండుపల్లె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ సాగించారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే నిందితుడి కోసం గాలిస్తున్నామని సుండుపల్లె ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అటవీ శాఖ డ్రైవర్ మృతి



వెంకటరమణ (ఫైల్)



మృతుడి నివాసం వద్ద వివేక్, బాబుల్‌రెడ్డి, ఖాదర్‌వలీ

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నఓరంపాడు క్రాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా ఫారెస్ట్ అధికారి వివేక్ వాహన డ్రైవర్ నక్కల వెంకటరమణ (48) మృతి చెందాడు. వివరాలిలా వున్నాయి. రాజంపేట పట్టణం సరస్వతీపురంలో నివాసముండే వెంకటరమణ శనివారం తన ఇద్దరు ఆడపిల్లలకు అవసరమయ్యే బ్యాగులు, దుస్తులు కొనుగోలు చేసేందుకు బైక్‌లో ఇద్దరు పిల్లలతో కలిసి తిరుపతికి బయలుదేరాడు. అయితే చిన్నఓరంపాడు క్రాస్ రోడ్డు దాటిన తరువాత ఉన్న డాబా వద్ద జాతీయ రహదారిపై నిలిచివున్న ట్రాక్టర్‌ను బైక్‌లో వెళుతున్న వెంకటరమణ ఢీకొన్నాడు. దీంతో వెంకటరమణకు తీవ్ర గాయాలు కాగా, తన ఇద్దరు కుమార్తెలకు స్వల్పగాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ వెంకటరమణను తిరుపతి వైపు కారులో వెళుతున్న వారు రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు. మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో వెంకటరమణను తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. కాగా వెంకటరమణ మృతి చెందిన విషయం తెలియగానే జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ పి.వివేక్.. మృతదేహాన్ని రాజంపేటకు తరలించేందుకు సిబ్బందితో తగిన ఏర్పాట్లు చేశారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న జిల్లా ఫారెస్ట్ అధికారి వివేక్

పుల్లంపేట మండలం అనంతసముద్రం పంచాయతీలోని పాపక్కగారిపల్లె గ్రామంలో శనివారం అంత్యక్రియలు జరిగాయి. వెంకటరమణ మృతదేహం పాపక్కగారిపల్లెకు చేరుకోవడంతో ఒక్కసారిగా పాపక్కగారిపల్లె గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకటరమణ అందరితో కలగోలుపుగా మెలిగేవాడు. ఈ కారణంగా అనేక మంది ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. జిల్లా ఫారెస్ట్ అధికారి వివేక్ కూడా పాపక్కగారిపల్లెకు చేరుకొని వెంకటరమణ అంత్యక్రియలు పూర్తయ్యే వరకు దగ్గర ఉన్నారు. ఈయనతోపాటు పెద్ద ఎత్తున ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు వివేక్ తక్షణ సాయం కింద రూ.50 వేలు అందజేశారు. అదే విధంగా డీఆర్‌ఓ ఎస్.రఘు ఆధ్వర్యంలో చిట్వేలి, రాయచోటి, సానిపాయి రేంజ్ పరిధిలోని సిబ్బంది రూ.30 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈకార్యక్రమంలో రిటైర్డ్ డీఎఫ్‌ఓ ఖాదర్‌వలీ పాల్గొని నివాళులు అర్పించారు.

అంతా తానైన ఎంపీపీ బాబుల్‌రెడ్డి

మృతుడు వెంకటరమణది వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి సొంత పంచాయతీ కావడంతో ఆయన అంతా తానై మృతుని అంత్యక్రియల ఏర్పాట్లను చేశారు. మృతి చెందిన విషయం బాబుల్‌రెడ్డికి తెలియగానే రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని త్వరగా తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అలాగే అంత్యక్రియలు ముగిసే వరకు కూడా బాబుల్‌రెడ్డి అక్కడే ఉన్నారు.

కుటుంబ నేపథ్యం....

మృతుడు వెంకటరమణ దాదాపు 25 సంవత్సరాలకు పైగా అటవీశాఖలో పని చేస్తున్నాడు. మృతుని భార్య రాజసులోచన అనంతసముద్రం పంచాయతీలో ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. మృతునికి ముగ్గురు కుమార్తెల్లో పెద్దకుమార్తె దివ్య కడప రిమ్స్‌లో పారామెడికల్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రెండవ కుమార్తె లక్ష్మీసాయి రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. మూడవ కుమార్తె రుచితరెడ్డి ప్రసన్న రాజంపేటలోని కేంద్రీయ విద్యాలయంలో ఏడవ తరగతి చదువుతోంది.

గోడౌన్ బియ్యం స్కామ్ నిందితుడు కోర్టులో లొంగుబాటు



నిందితుడు సదాశివ

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని ప్రభుత్వ పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌లో బియ్యం పంపిణీ అవకతవకలకు పాల్పడిన రెండవ నిందితుడు సదాశివ శుక్రవారం సాయంత్రం స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి ఉమర్‌ఫరూఖ్ ఎదుట లొంగిపోయాడు. న్యాయమూర్తి నిందితుడిని వైద్యపరీక్షల నిమిత్తం వైద్య విధాన పరిషత్ ఆసుపత్రికి తరలించి అనంతరం రిమాండ్‌కు పంపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పౌరసరఫరాల సంస్థ గోడౌన్‌లో గతేడాది అక్టోబర్‌లో సివిల్‌సప్లయ్స్ జిల్లా అధికారి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేయగా.. సుమారు 1000 టన్నుల బియ్యం, 20 టన్నుల కందిపప్పు, 2.8 టన్నుల చెక్కర రూ.4.60 కోట్ల విలువైన సరుకుకు సక్రమైన లెక్కలు లేకపోవడంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు తెలియజేశారు. మదనపల్లె అప్పటి ఆర్డీవో మురళి, జిల్లా మేనేజర్ శ్రీనివాసులు, డీఎస్‌వో రఘురాముల బృందాన్ని విచారణ అధికారులుగా కలెక్టర్ నియమించారు. వారి విచారణలో బియ్యం స్కామ్ జరిగిన తీరు వాస్తవమేనని నిర్ధారించి నివేదికలు జిల్లా కలెక్టర్‌కు పంపారు. సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు నిందితులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ములకలచెరువు సీఐ షాదిక్‌అలీ, అప్పటి ఎస్ఐ శోభారాణిలు ఫిర్యాదు మేరకు ఎ–1 నిందితుడు ఇన్‌చార్జి డీటీ హరిప్రసాద్, ఎ–2 నిందితుడు డేటా ఎంట్రీ ఆపరేటర్ సదాశివపై కేసు నమోదు చేశారు. దీంతో నిందితులిద్దరూ అజ్ఞాతంలోకి వెళ్లారు. అప్పటి నుంచి వారి కోసం పోలీసులు గాలించినా ఫలితం లేకపోయింది. డేటా ఎంట్రీ ఆపరేటర్ సదాశివ స్వచ్ఛందంగా కోర్టులో లొంగిపోయాడు. ఇన్‌చార్జి డీటీ హరిప్రసాద్ ఇప్పటికీ అజ్ఞాతంలో ఉండడం గమనార్హం.

నేర ప్రవృత్తి కట్టడితోనే శాంతిభద్రతలు



జిల్లా ఎస్పీ గంగాధరరావు

రాయచోటి : జిల్లాలో నేరాల సంఖ్య, నేర ప్రవృత్తి కట్టడితోనే శాంతిభద్రతలు సాధ్యమని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అభిప్రాయపడ్డారు. శనివారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లాలోని కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల ట్రైల్ మానిటరింగ్‌పై కోర్టు పోలీసులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరం జరిగినపుడు ఆ నేరం చేసిన వ్యక్తికి త్వరితగతిన కోర్టులో శిక్ష పడితే మరొకరు అలాంటి నేరాలు చేయటానికి భయపడతారని సూచించారు. తద్వారా నేరాల సంఖ్యని, నేర ప్రవృత్తిని కట్టడి చేసి శాంతిభద్రతలు నెలకొల్పవచ్చని ఐపీఎస్ కోర్టు పోలీసులకు తెలియపరిచారు. ప్రతి పోలీస్ అధికారి వారి పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల్లో శిక్ష పడటానికి ఎక్కువ అవకాశం ఉన్న 10 కేసులను ఎంపిక చేసుకొని వాటి ట్రయిల్ విషయంలో ప్రతిరోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. కేసును ముందుకు సాగేలా సాక్షుల చేత స్వేచ్ఛగా నిర్భయంగా సాక్ష్యం చెప్పేలాగా తర్ఫీదు ఇవ్వాలన్నారు. నిందితులు క్రమం తప్పకుండా హాజరయ్యేలాగా చూడాలన్నారు. ముఖ్యంగా ఇటీవల జరిగిన నేరాల్లో త్వరగా శిక్ష పడటానికి అవకాశం ఉన్న కేసుల్లో విచారణ త్వరగా జరిగి నేరస్తులకు శిక్ష పడటం వలన కొత్తగా నేరం చేయాలనుకునే వాళ్లకి భయం కలుగుతుందని చెప్పారు. తద్వారా నేరం చేయాలనే ఆలోచన నుంచి విరమించుకుంటారని తెలిపారు. అలాగే ఎంతో కాలంగా అనేక అంశాలతో కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ పూర్తయయేలాగా చూసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ఎవరైనా విచారణకు హాజరుకాని పక్షంలో వారికి ఎన్‌బిడబ్ల్యూ జారీ చేయించి వారిని తిరిగి హాజరుపరచడం చేయాలన్నారు. ఎంపిక చేసుకున్న 10 కేసుల్లో మహిళల మీద జరిగిన కేసులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

ప్రాణాపాయం నుంచి బయటపడ్డ వివాహిత

దిశ యాప్ ఎఫెక్ట్

మదనపల్లె : రాష్ట్రంలో మహిళల భద్రత కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన దిశ ఎస్‌ఓఎస్ యాప్ సత్ఫలితాలిస్తోంది. ఎంతో మంది మహిళలకు ఆపద సమయంలో వెన్నుదన్నుగా నిలిచిన దిశ యాప్.. తాజాగా ఓ వివాహితను ఆత్మహత్యాయత్నం నుంచి కాపాడి అండగా నిలిచింది. ఘటనకు సంబంధించిన వివరాలు... మదనపల్లె పట్టణం వైఎస్ జగన్ కాలనీకి చెందిన పూజిత, మనోజ్ దంపతుల మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి భార్యభర్తల మధ్య మరోసారి తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. మనోవేదనకు గురైన పూజిత క్రిమి సంహారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఈ విషయాన్ని గమనించిన పొరుగువారు దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి సమాచారం అందించారు. కొన్ని నిమిషాల్లోనే దిశ టీం అక్కడికి చేరుకున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న పూజితను స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. సరైన సమయంలో చికిత్స అందించడం వల్ల పూజిత ప్రాణాపాయస్థితి నుంచి బయటపడిందని కుటుంబ సభ్యులు తెలిపారు. దిశ ఎస్‌ఓస్‌కు కాల్ చేసి సమాచారం అందించిన స్థానిక మహిళలు రిజ్వాన, అమినాలను దిశ టీం అభినందించింది. నెల రోజుల క్రితమే తమ ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్లోడ్ చేసుకున్నట్లు మహిళలు తెలిపారు. దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసిన నిమిషాల వ్యవధిలో పోలీసులు వచ్చారని వారు పేర్కొన్నారు. బాధితురాలు పూజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో స్వర్ణకారుడు మృతి



సలీం (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఇస్లాంపురం వీధికి చెందిన షేక్ సలీం (45) అనే స్వర్ణకారుడు శనివారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. సలీం కొంత కాలం నుంచి స్వర్ణకారుడిగా పని చేస్తున్నాడు. అతను బంగారు ఆభరణాలకు మెరుగులు దిద్దుతుంటాడు. ఇటీవల అనారోగ్యంతోపాటు ఆర్థిక సమస్యలు కూడా ఎక్కువయ్యాయి. దీంతో తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో సాయంత్రం ఇంట్లో అపస్మారక స్థితిలో పడిపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో జిల్లా ఆస్పత్రికి చేర్పించారు. అయితే అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. కాగా సలీం సైనైడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. అతనికి భార్య షాబిరాతోపాటు జాఫర్ అనే కుమారుడు, సబిహా అనే కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

అతిగా మద్యం సేవించి..

ప్రొద్దుటూరులోని కేహెచ్‌ఎం స్ట్రీట్‌కు చెందిన కరిముల్లా (41) అనే వ్యక్తి అతిగా మద్యం సేవించి మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. కరిముల్లా బేల్దారి పనికి వెళ్తుంటాడు. అతనికి మూర్ఛ వ్యాధి కూడా ఉంది. తరచూ మద్యం సేవించి రాత్రి సమయంలో రాయల్ ఫంక్షన్ హాల్ సమీపంలో పడుకొని తిరిగి ఉదయం ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో శనివారం ఉదయమైనా కరిముల్లా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడు. ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించగా చనిపోయినట్లు డాక్టర్ తెలిపాడు. అతిగా మద్యం సేవించి అతను మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భార్య గౌషియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

ఆకాశవాణి శతవసంతాలు చేసుకుంటుంది

ఘనంగా కడప ఆకాశవాణి 60 ఏళ్ల సభ



మాట్లాడుతున్న జానమద్ది విజయభాస్కర్

కడప కల్చరల్ : ఆకాశవాణి కడప కేంద్రం షష్టి పూర్తి చేసుకోవడం శుభపరిణామమని, ఇది శతవసంతాలు పూర్తి చేసుకుంటుందని తనకు ప్రగాఢ విశ్వాసం ఉందని సీపీ బ్రౌన్ గ్రంథాలయ సలహా మండలి సభ్యులు, ఏపీజీబీ రిటైర్డ్ మేనేజర్ జానమద్ది విజయభాస్కర్ అన్నారు. 60 వసంతాల కడప ఆకాశవాణి కేంద్రం ప్రస్థానం పేరిట శనివారం కడప నగరంలోని ఆకాశవాణి కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు, నగర ప్రముఖులు, ఆకాశవాణి అభిమానులతో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తమతండ్రి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితోపాటు మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యులు, మరికొందరు నాటి ప్రముఖులు ఆకాశవాణి ఉన్నతికి ఉద్యమించారని గుర్తు చేశారు. సీమ రైతులు, కళాకారులు, మేధావుల ఆలోచనలను నలుగురికి తెలిపిన ఆకాశవాణి సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శారద మాట్లాడుతూ రేడియో వినడమే ఓ ఎడ్యుకేషన్ అని భావించి అభిమానులుగా మారామన్నారు. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ ఎ.విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నిన్న, మొన్నటి తరాలకు ఆకాశవాణితో గల బంధాన్ని వర్ణించలేమన్నారు. ఆకాశవాణి కడప కేంద్రం పూర్వ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత స్థాయి ప్రతిభావంతులు ఈ కేంద్రం ప్రతిష్టను కాపాడారని, జాతీయ అవార్డును కూడా సాధించిందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ ఎస్.జయసింహా, ఆకాశవాణి సిబ్బంది ఆదినారాయణరెడ్డి, గౌరీశంకర్, రవికుమార్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా జానపద గాయని ఓటు సుబ్బమ్మ జానపద గీతాన్ని ఆలపించి అందరినీ అలరించారు.

రైతులకు నాణ్యమైన సేవలందించాలి

కడప అగ్రికల్చర్ : క్షేత్ర స్థాయిలో ఏర్పాటు చేసే డ్రిప్పు, స్ప్రింక్లర్ల ఏర్పాటులో రైతులకు నాణ్యమైన సేవలను అందించాలని ఏపీ సూక్ష్మ సేద్య సాగు పథక జిల్లా ప్రాజెక్టు అధికారి రవీంద్రనాథరెడ్డి ఎంఐ కంపెనీ ఫిట్టర్లకు సూచించారు. శుక్రవారం ఏపీఎంఐపీ పరికాలకు సంబంధించి డ్రిప్పు, స్ప్రింక్లర్ల అమరికపై కంపెనీ ఫిట్టర్లకు కడపలోని ఏపీ ఎంఐపీ కార్యాలయ ఆవరణలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఐ ఇంజినీర్లు శ్రీనివాసులు, ఫణీంద్రబాబు పొలాల్లో పరికరాలను ఏ విధంగా బిగించాలి, పరికరాల నిర్వహణ, వాటి ఉపయోగం గురించి ఫిట్టర్లకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా 10,500 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. క్షేత్ర స్థాయిలో నాణ్యతగా పని చేస్తేనే మన సేవలను రైతులు పూర్తిగా పొందగలుగుతారన్నారు. పరికరాల అమరికలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలన్నారు. ఈ సంవత్సరం కూడా అవసరమున్న ప్రతి రైతుకు సూక్ష్మ సేద్యాన్ని అందించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్ రెడ్డి, ఎంఐ ఇంజనీర్లు, ఎంఐ డీసీలు, ఎంఐ ఏఓల తోపాటు ఎంఐ కంపెనీ ఫిట్టర్లు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మమ్మ

కురబలకోట : అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం రాత్రి కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. కంటేవారిపల్లెకు చెందిన మల్లప్ప భార్య లక్ష్మమ్మ (65) కొన్నేళ్లుగా వెన్ను నొప్పితో బాధపడుతోంది. ఏళ్లుగా ఆసుపత్రికి వెళుతూ మందులు వాడుతున్నా ఆశించిన ప్రయోజనం కల్గలేదు. బాగుకాని రోగంతో ఎన్నాళ్లు బతకాలన్న కారణంగా జీవితంపై విరక్తి చెందింది. చనిపోవాలని ఇంటి సమీపంలోని జిల్లేడు పాలు తాగింది. వెంటనే కుటుంబీకులు గమనించి హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కోలుకుంటోందని డాక్టర్లు తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని కుచ్చుటోపీ

లక్కిరెడ్డిపల్లి : కలెక్టర్ ఆఫీసులో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నిరుద్యోగుల వద్ద నుంచి రూ.3.33 లక్షలు తీసుకొని మోసం చేశాడని బాధితుడు దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లిలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న శాంతయ్య అనే వ్యక్తి దుర్గయ్య అనే నిరుద్యోగి వద్ద నుంచి ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేశాడని బాధితుడు వాపోయాడని తెలిపారు. ఏడాది గడుస్తున్నా ఉద్యోగం విషయం మరిచాడని, డబ్బులు అడిగితే తనకు తెలియదు అంటున్నాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. జాబ్‌ఫ్రాడ్ చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న బైక్

కొండాపురం : మండల పరిధి లావనూరు సమీపంలోని డంప్ యార్డ్ వద్ద శనివారం బ్రిడ్జి రక్షణ గోడను ఢీకొన్న ప్రమాదంలో రాచమల్లు సుధాకర్ రెడ్డి(52) మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. పైడిపాళెం గ్రామానికి చెందిన రాచమల్లు నారాయణరెడ్డి కుమారుడు రాచమల్లు సుధాకర్ రెడ్డి కొండాపురం నుంచి తన సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గం మధ్యలో లావనూరు గ్రామ సమీపంలోని ఉపాధి హామీ డంప్ యార్డ్ వద్ద రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడ ఉంది. ఈ గోడను ఢీకొట్టాడు. దీంతో అతను వంకలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

చాపాడు : విశ్వనాథపురం గ్రామానికి చెందిన భూమిరెడ్డి పుల్లారెడ్డి(57) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. పుల్లారెడ్డి కూతురు ఇటీవల ప్రసవం కోసం పుట్టిల్లు అయిన విశ్వనాథపురం గ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో మద్యం అలవాటు ఉన్న పుల్లారెడ్డి రోజూ తాగి ఇంటికి వచ్చి కుటుంబీకులను వేధిస్తుండేవాడు. ఈ నెల 12న మద్యం సేవించి భార్యతో గొడవ పడగా పుల్లారెడ్డిని మందలించింది. ఆయన గ్రామ శివారులో పొలాల్లోకి వెళ్లి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడు కర్నూలులో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.